ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 5 జనవరి 2024


దన్నానపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న భువనేశ్వరి

అండగా ఉంటాం ఆదుకుంటాం


దవళపేటలో అసిరినాయుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

- మృతుల కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసా
- 'నిజం గెలవాలి' పేరిట పరామర్శ
- బాధితులకు రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం
- అడుగడుగునా పార్టీ శ్రేణులు, అభిమానుల నీరాజనం

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ఆమదాలవలస/జి.సిగడాం/బూర్జ)

'అధైర్యపడొద్దు. అండగా ఉంటాం. అన్ని విధాలా ఆదుకుంటాం' అని మృతుల కుటుంబాలకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి భరోసా ఇచ్చారు. కొన్నాళ్ల కిందట స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపం చెంది జిల్లాలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు మృతి చెందారు. బూర్జ మండలం తోటవాడలో గతేడాది సెప్టెంబరు 9న గేదెల సాంబమూర్తి, ఆమదాలవలస మండలం పాతనిమ్మతర్లాడలో గొండు ఎర్రయ్య, సెప్టెంబరు 11న ఆకేటి పారయ్య, దన్నానపేటలో గొర్లె తిరుపతిరావు, జి.సిగడాం మండలం దవళపేటలో గతేడాది అక్టోబరు 4న కంచరాన అసిరినాయుడు తీవ్ర కలత చెంది ప్రాణాలు కోల్పోయారు. 'నిజం గెలవాలి' పేరిట ఆయా మృతుల కుటుంబసభ్యులను భువనేశ్వరి గురువారం పరామర్శించారు. ఆర్థికసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.3లక్షలు చొప్పున చెక్కులు అందజేశారు. ఎల్లప్పుడూ పార్టీ తరపున అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

- ముందుగా.. జి.సిగడాం మండలం దవళపేటకు చెందిన మాజీ సైనికుడు కంచరాన అసిరినాయుడు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. మృతుడి భార్య అరుణకుమారి, కుమారులు అఖిల్, అభిషేక్‌తో కాసేపు మాట్లాడారు. ఎప్పుడూ అండగా ఉంటామని, అధైర్యపడొద్దని మనోధైర్యాన్ని కల్పించారు. అసిరినాయుడు పేరున గ్రామంలో గ్రంథాలయాన్ని నిర్మిస్తే పలువురి ఉన్నత విద్యకు దోహదపడుతుందని మృతుడి సోదరుడు సూరన్నాయుడు భువనేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. పార్టీ తరపున సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.

- అనంతరం సాయంత్రం 5.30 గంటలకు బూర్జ మండలం తోటవాడ గ్రామానికి చేరుకున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూన రవికుమార్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పార్టీ శ్రేణులతో కలిసి గేదెల సాంబమూర్తి కుటుంబాన్ని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తర్వాత ఆమదాలవలస మండలం నిమ్మతర్లాడ, దన్నానపేట గ్రామాల్లో పర్యటించి గొండు ఎర్రయ్య, ఆకేటి పారయ్య, గొర్లె తిరుపతిరావు కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ ప్రజలకోసమే అని.. ఇటు కార్యకర్తల సంక్షేమం కూడా మరిచిపోదని.. అందరూ ధైర్యంగా ఉండాలంటూ భరోసా ఇచ్చారు. ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ 'నిజం గెలవాలి' యాత్ర ముగించారు. అనంతరం విశాఖపట్నం పయనమయ్యారు.

- ఇదిలా ఉండగా భువనేశ్వరికి పర్యటించిన ప్రతిచోటా టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా జేజేలు కొడుతూ.. అడుగడుగునా నీరాజనం పలికారు. 'జై బాబు.. జై జై చంద్రబాబు' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వి.అనిత, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎమ్మెల్సీ గుమ్మిడి సంధ్యారాణి, కిమిడి కళావెంకటరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్, మామిడి గోవిందరావు, అలాగే జనసేన నాయకులు పేడాడ రామ్మోహనరావు, అన్ని మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నిమ్మతర్లాడలో...




తోటవాడలో సాంబమూర్తి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న భువనేశ్వరి


నిమ్మతర్లాడ, దన్నానపేటలో మృతుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం


దన్నానపేటలో అభివాదం చేస్తున్న భువనేశ్వరి

పాఠశాల కమిటీలకు కొత్త చిక్కులు


బూర్జపాడులోని పాఠశాల భవనం

- పదవీకాలం పొడిగింపుతో సమస్యలు
- భర్తీకాని ఖాళీలతో చెల్లింపులకు ఆటంకాలు

(ఇచ్ఛాపురం రూరల్)

పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ పాలక వర్గాలకు గడువు ముగియడంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా వాటి పదవీకాలాన్ని ఈ ఏడాది జూన్ వరకు పొడిగించింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సరికొత్త చిక్కులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న ఖాళీలు భర్తీ కాకపోవడంతో చెల్లింపులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో 1940 ప్రాథమిక, 307 ప్రాథమికోన్నత, 452 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల విలీనం, నాడు-నేడు పనులు నిధుల సమస్యతో నిర్దేశిత సమయానికి పూర్తికాకపోవడంతో తరగతి గదుల సమస్య ఏర్పడింది. దీంతో కొందరు పిల్లలు అసౌకర్యాల మధ్య చదువు సవ్యంగా సాగదని ప్రైవేటు బడుల్లో చేరారు. పదోతరగతి పూర్తి చేసుకుని మరికొందరు వెళ్లిపోయారు. ఇలా వెళ్లిన పిల్లల తల్లిదండ్రుల్లో ఎవరైనా స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా, సభ్యులుగా ఉంటే కొత్తవారిని నియమించుకోవాలి. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున ప్రాథమిక పాఠశాలల్లో 15మంది, ఉన్నత పాఠశాలల్లో 24 మందిని పాలక వర్గ సభ్యులుగా ఎన్నుకోవాలి. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదట్లో ఈ కమిటీ ఎన్నికలకు అధికారపార్టీ వాళ్లు చైర్మన్ల నుంచి సభ్యుల వరకు ఉండేందుకు పోటీపడ్డారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ఖాళీ పదవులకు పోటీ పడేవారు లేదు. ఖాళీ అయిన సభ్యులు, చైర్మన్ల భర్తీకి ఆపసోపాలు పడాల్సి వస్తోందని కొందరు ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ఈ పదవులు భర్తీ చేయకుండా పాలకవర్గాన్ని నడపలేరు.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పట్టవా?

కమిటీ చైర్మన్, హెచ్‌ఎం పేరుతో సంయుక్త బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసుకుని నాడు-నేడు పనులకు సంబంధించిన నిధులు వెచ్చిస్తున్నారు. ఇలా స్కూళ్ల నిర్వహణలో పేరెంట్స్ కమిటీల ప్రాధాన్యం కీలకంగా ఉంది. పాలకవర్గాల గడువు ముగిసినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పాత కమిటీలనే పొడిగించింది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయిలో ఉండే ఇబ్బందుల్ని పరిగణనలోకి తీసుకోలేదు. చాలామంది పిల్లలు చదువులు పూర్తి చేసుకుని వెళ్లి ఉంటారని, వారి స్థానాల్లో ఇప్పటికిప్పుడు కొత్తగా నియామకం కావడానికి ఆసక్తి చూపేవారు లేకపోతే ఆ ఖాళీల భర్తీ చేయడం కష్టమేనని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ కమిటీలకు అన్ని సామాజికవర్గాల నుంచి ప్రాతినిధ్యం కల్పించాలి. కొన్ని వర్గాలు తమకు పదవులు వద్దని తిరస్కరిస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఖాళీల భర్తీ కాక.. బిల్లుల చెల్లింపులు నిలిచిపోయే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఇచ్ఛాపురం ఎంఈవో కురమాన అప్పారావుని వివరణ కోరగా ప్రభుత్వం ప్రస్తుత కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూన్ వరకు పొడిగించిదని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నిరసన హోరు.. సడలని పోరు

- కొనసాగుతున్న అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికుల సమ్మె

అరసవల్లి, జనవరి 4: సమస్యల పరిష్కారం, హామీల అమలు కోరుతూ అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికుల పోరాటం కొనసాగుతూనే ఉంది. గురువారం శ్రీకాకుళం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిరసన తెలిపారు. ఇంత నిర్లక్ష్యం తగదంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి మాట్లాడుతూ.. 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 'అంగన్‌వాడీలకు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలి. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. సమానపనికి సమాన వేతనం అందజేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి' అని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి, ఈశ్వరమ్మ, జి.రాజేశ్వరి, లతాదేవి, మాధురి, జ్యోతిలక్ష్మి, శారద, సరోజిని పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికుల సమ్మె పదో రోజుకు చేరింది. కార్మికులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వేతనాలు పెంచాలని, మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, బవిరి కృష్ణమూర్తి, యుగంధర్, ఆర్మి రాము, కె.రాజు, డి.చిట్టిబాబు, మాధవి, రాజేశ్వరి, పార్వతి పాల్గొన్నారు.


ఒంటికాలిపై అంగన్‌వాడీల నిరసన


నినాదాలు చేస్తున్న మునిసిపల్ కార్మికులు

దున్నపోతుకు సమగ్రశిక్ష ఉద్యోగుల వినతి..

కలెక్టరేట్: కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరుకుంది. గురువారం ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. సమగ్రశిక్ష ఉద్యోగులు దున్నపోతుకు తమ సమస్యలను వివరించి.. వినతిపత్రాన్ని అందజేశారు. అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు తమ సమస్యలు విన్నవించినా పట్టించుకోలేదని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ ఆరోపించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు పోతయ్య, తారక్, రాము, యుగంధర్, రామకృష్ణ, గౌరీశంకర్, అరుంధతి, విమల జయలక్ష్మి, నరసింగరావు, శ్రీను, రమణ, చిరంజీవి, సంతోష్, ధనుంజయ, శ్రీదేవి, రత్నకుమారి, రమాదేవి, ప్రభ పాల్గొన్నారు.


దున్నపోతుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

జయహో బీసీ

- ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు


మాట్లాడుతున్న గౌతు శిరీష, కార్యక్రమానికి హాజరైన పలాస టీడీపీ నేతలు

పలాస, జనవరి 4: విజయవాడలోని మంగళగిరిలో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో తెలుగుతమ్ముళ్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తదితరులు పాల్గొన్నారు. బీసీలను ప్రోత్సహించింది టీడీపీయేనని గౌతు శిరీష పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ప్రస్తుతం బీసీల జపం చేస్తున్నారని, వాస్తవానికి ఒక్క బీసీకి అయినా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. బీసీ స్టడీసర్కిల్, ఆదరణ వంటి పథకాలకు మంగళం పాడారని, కులవృత్తులను గుర్తించింది తామేనన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, పీరుకట్ల విఠల్‌రావు, బడ్డ నాగరాజు, బూర్లె కృష్ణరాజు, యవ్వారి మోహనరావు, రట్టి లింగరాజు పాల్గొన్నారు.


వేదికపై చంద్రబాబు, అచ్చెన్నాయుడు

సీఐలు, ఎస్‌ఐల బదిలీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 4: విశాఖ రేంజ్ పరిధిలో 16 మంది సీఐలు, 34మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ.. డీఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం సిటీ సీఐ సీహెచ్ సురేష్ నాయుడును శ్రీకాకుళం డీసీఆర్‌బీ సీఐగా బదిలీ చేశారు. రేంజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ నల్లి సాయిని పాతపట్నం సీఐగా, విశాఖ సిటీలో సీఐ ఎం.అవతారంను శ్రీకాకుళం ట్రాఫిక్‌స్టేషన్‌కు, విశాఖ సిటీలో విధులు నిర్వహిస్తున్న ఇమాన్యువల్ రాజును శ్రీకాకుళం ట్రాఫిక్ ఫోర్స్‌కు బదిలీ చేశారు. విశాఖరేంజ్‌లో వీఆర్‌లో ఉన్న జి.దేవుళ్లను శ్రీకాకుళం పీసీఆర్‌కు, శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ ఎస్.కామేశ్వరరావును విశాఖపట్నం వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే సిక్కోలులో పనిచేస్తున్న ఏడుగురు ఎస్‌ఐలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఎనిమిది మందికి ఇక్కడ అవకాశం కల్పించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ చుక్క స్వామినాయుడు, విశాఖ టూటౌన్ ఎస్‌ఐ లోకవరపు చంద్ర శేఖర్, ఆరిలోవ ఎస్‌ఐ బరుకు అనిల్‌కుమార్, హార్బర్ క్రైం ఎస్‌ఐ డి.సూరిబాబు, త్రీటౌన్ ఎస్‌ఐ కె.నర్సింగరావు, మల్కాపురం ఎస్‌ఐ పిడిటి శంకర్, గోపాలపట్నం ట్రాఫిక్ నుంచి కె.శ్రీనివాసరావు, పీఎంపాలెం ఎస్‌ఐ పి.మురళీకృష్ణ జిల్లాకు బదిలీపై రానున్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఎల్.రామకృష్ణ, సీహెచ్ హరికృష్ణ, ఎ.సింహాచలం, ఎ.వరదరాజులు, సీహెచ్‌వీ మోహనరావు, ఎం.వెంకటరావు, ఆర్.శంకర్‌రావును విశాఖపట్నం బదిలీ చేశారు. వీరంతా బదిలీ అయిన ప్రాంతంలోని ఎస్పీలకు రిపోర్ట్ చేయనున్నారు.

భువనేశ్వరిని కలిసిన నేతలు





భువనేశ్వరిని కలిసిన కలమట, ఎంజీఆర్, వజ్రపుకొత్తూరు నేతలు

కొత్తూరు/వజ్రపుకొత్తూరు/పాతపట్నం: 'నిజం గెలవాలి' పేరుతో టీడీపీ అధినేత సతీమణి నారా భువనేశ్వరి జిల్లాలో పర్యటించిన నేపథ్యంలో పలువురు నేతలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, సాగర్ కొత్తూరు వద్ద పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అలాగే వజ్రపుకొత్తూరుకు చెందిన టీడీపీ నాయకులు బూర్జ వద్ద నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను కలిసిన వారిలో పలాస నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు పుచ్చ శోభారాణి, మాజీ విప్ కర్రి డిల్లేశ్వరి, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు ఉన్నారు. అలాగే టీడీపీ నేత, సామాజికవేత్త మామిడి గోవిందరావు (ఎంజీఆర్) నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

డబ్బులిస్తేనే ట్రక్ షీట్లు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ట్రాక్టర్‌తో నిరసన
- కొనుగోలుకు చుక్కలు చూపిస్తున్నారని రైతుల ఆవేదన

మెళియాపుట్టి: డబ్బులిచ్చే వారికే ట్రక్ షీట్లు ఇస్తున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగుతున్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధాన్యం లోడుతో నిరసన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మారడికోట సర్పంచ్ పెద్దింటి భాగ్యం పండించిన ధాన్యం షెడ్యూల్‌ను గత నెల 28న ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ట్రక్ షీట్ ఇవ్వలేదు. అయితే జోడూరు రైతుభరోసా కేంద్రానికి వెళితే కోసమాళ పీఏసీఎస్‌కు వెళ్లి ట్రక్ షీట్ చేయించుకోవాలని సిబ్బంది చెప్పడంతో అక్కడికి వెళ్లారు. అయితే అక్కడ కూడా తీవ్ర నిరాశే ఎదురైంది. జోడూరు ఆర్బీకేకే వెళ్లాలని పీఏసీఎస్ సిబ్బంది చెప్పడంతో ఆవేదన చెందుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అలాగే మారడికోట గ్రామానికి చెందిన మరో రైతు తిరుపతిరావుకు ఇలాంటి సంఘటనే ఎదురైంది. ఒక్కో ట్రక్ షీట్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు సిబ్బంది వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఈ విధంగా వసూళ్లకు పాల్పడుతున్నా వ్యవసాయశాఖాధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు పండించిన పంటలకే ఇలా ఉంటే సాధారణ రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోలేక పోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లర్లు సైతం రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. బస్తాకు ఐదు కిలోల నుంచి 10 కిలోల వరకు ధాన్యం తీసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ట్రాక్టర్ లోడుతో నిరసన

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



నరసన్నపేటలో...



మర్రిపాడులో...

నరసన్నపేట: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు బోయన ఆనంద్ అన్నారు. గురువారం పట్టణంలో బాబుతో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబునాయుడును సీఎం చేయాలని కోరారు. వైసీపీ నాయకుల మాయ మాటలు నమ్మవద్దని ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నరసన్నపేట నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు అన్నారు. కూర్మనాథపురం పంచాయతీ మర్రిపాడులో గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ అక్రమాలతోపాటు టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సాధు చిన్నికృష్ణంనాయుడు, రోణంకి గణపతిరావు పాల్గొన్నారు. ● **హిరమండలం:** టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. గురువారం హిరమండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ వంద రోజులు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, నేతలు బర్రి సురేష్, శ్రీనివాసరావు, ఎస్.గోవింద తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఎస్ఎస్ఏ ఉద్యోగులు

హిరమండలం: సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించేందుకు శుక్రవారం నిర్వహించనున్న చలో విజయవాడకి వెళ్లకుండా ఉండేందుకు గాను గురువారం ఉద్యోగులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కొంత సమయం స్టేషన్‌లోనే ఉంచి ఆ తరువాత విడిచిపెట్టారు.

జానపద కళాజాతరలో పాల్గొనండి

- ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగోకు ఆహ్వానం

పలాసరూరల్: పలాస మండలం రంగోయి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న జానపద కళల ప్రదర్శన కళాజాతరకు ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు బద్రి కూర్మారావు తదితరులు తెలిపారు. ఈ మేరకు గొమాంగోను కలిసి ఆహ్వానపత్రం అందించారు. గిడుగు రామమూర్తి తెలుగుభాష- జానపద కళాపీఠం, బద్రి అప్పన్న స్మారకకళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జానపద కళల ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. 20 వసంతాల కళాజాతర సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు రానున్నారని, ఉత్తరాంధ్ర జానపద నవగీతాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



అయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తున్న బాలకృష్ణ

వజ్రపుకొత్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ అన్నారు. గురువారం బెండిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో పేదలకు 17 పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకాలకోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉజ్వల కనెక్షన్లు పంపిణీ

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ భారత్‌లో భాగంగా బీజేపీ అమలుచేస్తున్న పలు పథకాలను బన్నువాడ గ్రామంలో గురువారం వివరించారు. అనంతరం ఉజ్వల పథకం కింద పలువురు లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన పథకాలు అమలు చేసి మన్ననలను పొందుతోందని బీజేపీ యువమోర్చా నాయకుడు నరేంద్ర చక్రవర్తి అన్నారు. కార్యక్రమంలో లింగరాజు, కామేశ్వరరెడ్డి, రాజకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలాస సీటు అగ్నికుల క్షత్రియులకు కేటాయించాలి



మంత్రి బొత్సను కలిసి అగ్నికుల క్షత్రియ సంఘ నేతలు

పలాస, జనవరి 4: పలాస అసెంబ్లీ టిక్కెట్‌ను అగ్నికుల క్షత్రియులకు కేటాయించాలని ఆ సంఘ నేతలు కోరారు. ఈ మేకు మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు పార్టీ పెద్దలను గురువారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాల కంటే అగ్నికుల క్షత్రియులు 40 వేలకు పైగా జనాభా ఉన్నారని, ఈ వర్గానికి టికెట్ ఇస్తే గెలిపించి కానుకగా ఇస్తామన్నారు. సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందించారు. మంత్రులు నాయకులను కలిసిన వారిలో సంఘ నేతలు జుత్తు నీలకంఠం, బచ్చల మధు, పులకల శ్రీరాములు, తిమ్మల ఉమామహేశ్వర రావు, జుత్తు పురుషోత్తం, తెప్పల పాలయ్య, జుత్తు కృష్ణమూర్తి, తెప్పల కృష్ణారావు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



నర్సింహమూర్తి (ఫైల్)

నందిగాం: పెద్దతామరాపల్లి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రొణగల నర్సింహ మూర్తి గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన టెక్కలిలో నివాసం ఉంటున్నారు. ఉదయం ఇంటి వద్దనే గుండెపోటుకు గురవడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలిం చినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, తల్లిదండ్రులు, కుమార్తె, కుమారులు ఉన్నారు. హెచ్ఎం ఉప్పాడ ఇందిర, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

పరీక్షలపై భయాన్ని పోగొట్టాలి

నరసన్నపేట: విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేందుకు కృషి చేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి. దాలినాయుడు సూచించారు. గురువారం స్థానిక బోర్డు ఉన్నత పాఠ శాల, బొరిగి వలస ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు దోహదపడే ఈ కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థుల వివరాలను రిజస్ట్రేషన్ చేయాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు రివిజన్ చేయించాలని, మాక్ టెస్టులు నిర్వహించాలని సూచించారు.

నేడు ఉద్యోగ మేళా

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు.

'నిందితులను శిక్షించడంలో పోలీసులు విఫలం'

టెక్కలి: విశాఖలో దళిత మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించడంలో ప్రభుత్వం, పోలీసులు ఇందులో విఫలమయ్యారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ ఘటనపై పోలీసులు వ్యవహరించిన తీరుపై అనుమానాలున్నాయన్నారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్‌చేశారు.

జగన్ ప్రభుత్వంలో కార్పొరేషన్లు నిర్వీర్యం

నందిగాం: జగన్ ప్రభుత్వంలో వివిధ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు అన్నారు. గురువారం నందిగాంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వక, లబ్ధి చేకూరకపోవడంతో ఆయా వర్గాలు నిరాశా నిస్పృహలకు గురయ్యాయన్నారు. ఆయా వర్గాల ఓట్లు పొంది చివరకు వారికే పంగనామాలు పెట్టారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలన్నారు.

పథకాలుంటే కదా తొలగించేది?

జలుమూరు (సారవకోట): మా ఇంటిలో ప్రభుత్వ పథకాలుంటే కదా తొలగించేది అని నరసన్నపేట ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. బొంతు గ్రామంలో బుధవారం వైసీపీ నేతలు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణదాస్ సతీమణి పద్మప్రియ పాల్గొన్నారన్నారు. ఆమె మా ఇంటికి వచ్చి నా భార్య రాజ్యలక్ష్మికి వైసీపీ బుక్ లెట్ ఇచ్చి పథకాలను వివరిస్తుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తెల్లరేషన్ కార్డు కూడా తీసేశారని పేర్కొంటూ ఆ బుక్‌లెట్‌ను తీసుకునేందుకు నిరాకరించడంతో పద్మ ప్రియ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ ఇంటిలో ఉన్న పథకాలను నిలుపుదల చేయాలని ఆదేశించారన్నారు. అయితే మా ఇంటిలో ఎలాంటి పథకాలు లేకుండానే ఆదేశించడం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

సీఎం హామీ నిలబెట్టుకోవాలి



అర్ధనగ్నంగా పారిశుధ్య కార్మికుల నిరసన

కాశీబుగ్గ/పలాస, జనవరి 4: పాదయాత్రలో సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు పదో రోజు గురువారం సమ్మె చేపట్టారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం నుంచి పలాస మునిసిపల్ కార్యాలయం వరకు పారిశుధ్య కార్మికులు అర్ధనగ్నంగా ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, సీపీఐ నాయకులు చాపర వేణుగోపాల్, శ్రీనివాస్‌రావు, పారిశుధ్య కార్మిక సంఘ నేతలు మురుగన్, రవి, దివాకర్, శంకర్ పాల్గొన్నారు. ● **ఇచ్ఛాపురం:** కార్మికుల సమస్యలు పరిష్కారంలో విఫలమైన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని సీఐటీయూ జిల్లా నాయకుడు రమేష్ పట్నాయక్ తెలిపారు. గురు వారం ఇచ్ఛాపురంలో పదో రోజు సమ్మెలో భాగంగా పారిశుధ్య కార్మికులు ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. ● **ఆమదాలవలస:** మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా పదో రోజు మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై సంఘ అధ్యక్షుడు కె.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మానవహారం నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల సంఘ నాయకులు తారకేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: రాస్తారోకో చేస్తున్న దృశ్యం



ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న కార్మికులు

శివాజీ పరామర్శ

వజ్రపుకొత్తూరు: డోకులపాడు గ్రామానికి చెందిన పల్లేటి బాపనమ్మ ఇటీవల మృతి చెందగా గురువారం ఆ కుటుంబానికి మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి చెప్పారు. ● **పలాస రూరల్:** పలాస మండలం శాసనం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు డల్లి నర్సింగరావును గురువారం మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

హిరమండలం: మండలంలోని 33 కేవీ పాతపట్నం-హిరమండలంలో ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జి.శంకరరావు తెలి పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

పోలాకి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కంచరాన శ్రీరాములు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త ఓటర్లు, చేర్పులు, మార్పులు ఉంటే వీఆర్వో ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు.


ఆమదాలవలస మండలంలోని పాతనిమ్మతర్లాడలో ..


జి.సిగడాం మండలంలోని దవళపేటలో అభిమానుల కోలాహలం


దవళపేటలో భువనేశ్వరికి స్వాగతం పలుకున్న అభిమానులు

భువనేశ్వరికి జన నీరాజనం

- తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- కరచాలనం, సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి

జిల్లాలో నిజం గెలవాలి పేరుతో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పలికారు. చంద్రబాబునాయుడి అరెస్ట్ నేపథ్యంలో జిల్లాలో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించారు. భువనేశ్వరికి చూసేందుకు అధికసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలి వచ్చారు. ఆమెతో కరచాలనం చేసేందుకు ప్రజలు పోటీపడ్డారు. సెల్ఫీ దిగేందుకు అభిమానులు ఆసక్తిచూపారు.


బూర్జ మండలం తోటవాడలో..


భువనేశ్వరితో మాట్లాడుతున్న గొండు శంకర్


భువనేశ్వరితో పొందూరు మహిళా నేతలు

అదృశ్యమైన బాలిక శ్రీకాకుళంలో గుర్తింపు

సంతబొమ్మాళి: గత నెల 30న వడ్డితాండ్ర గ్రామం నుంచి అదృశ్యమైన మైనర్ బాలికను శ్రీకాకుళంలో గురువారం గుర్తించామని నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన బాలిక టెక్కలి, అక్కడ నుంచి శ్రీకాకుళం వెళ్లి తిరుగుతుండగా డిస్ట్రిక్ట్ చైల్డ్ సంస్థ ప్రతినిధులు బాలికను బాలసదన్‌లో చేర్చారు. తప్పుడు అడ్రస్ ఇచ్చి అక్కడ ఉందని తమకు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి విచారణ చేసి గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

ఉప్పరపేట వద్ద బొగ్గు లారీ బోల్తా

జలుమూరు: అంధవరం పంచాయతీ ఉప్పరపేట వద్ద గురువారం ఉదయం బొగ్గుతో వెళుతున్న లారీ బోల్తాపడింది. నరసన్నపేట నుంచి పర్లాం వైపు వెలుతున్న లారీ బోల్తాపడగా ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ఉప్పరపేట వద్ద వంతెన భారీ ఇసుక లోడులు వెళ్లడంతో కూలిపోయింది. వాహనాలు రాకపోకలకు అంతరాయం లేకుండా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అక్కడే ప్రస్తుతం బొగ్గుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఆ సమయానికి లారీలో డ్రైవరు ఒక్కడే ఉన్నాడు. అతనికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్.ఐ పి.పారినాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చత్తీస్‌గడ్ వెళ్లాల్సిన బొగ్గులారీ రూటు తప్పి లూప్‌లైన్‌లోకి వెళ్లి బోల్తాపడిందని ఆయన తెలిపారు.

రెండు తులాల బంగారం దొంగతనం

రణస్థలం : మండలంలోని పతివాడపాలేం గ్రామానికి చెందిన పతివాడ లక్ష్మికి సంబంధించిన రెండు తులాల బంగారం ఆభరణం గుర్తు తెలియని వ్యక్తులు గురువారం దొంగిలించారు. బాధితురాలి కథనం మేరకు.. పొలం పనులు చేసుకుని లక్ష్మి ఇంటికి వస్తోంది. ఆ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యకులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో బంగార ఆభరణం తెంపుకొనిపోయారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసునమోదు చేశారు.

అంతర్ వర్సిటీ క్రికెట్ పోటీల జట్టు ఎంపిక

ఎచ్చెర్ల: చెన్నైలో ఈనెల ఏడు నుంచి 15వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ క్రికెట్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున పాల్గొనే జట్టును ఎంపిక చేశారు. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం) మైదానంలో రెండు రోజుల పాటు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ఎంపికల్లో వర్సిటీ, అనుబంధ కళాశాలల నుంచి 89 మంది క్రీడాకారులు హాజరుకాగా 11 మందిని ,అలాగే ఐదుగురిని ఎక్స్‌ట్రా ప్లేయర్స్‌గా ఎంపిక చేశారు. క్రీడాకారులకు వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, స్పోర్ట్స్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ బీవీ రమణమూర్తి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకుడు డాక్టర్ ఎ.భాస్కర్ అభినందించారు.

సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు పరిశీలకుడిగా భాస్కర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ క్రీడా విభాగానికి చెందిన డాక్టర్ ఎ.భాస్కర్ సౌత్ జోన్ అంతర వర్సిటీ క్రికెట్ పోటీలకు పరిశీలకుడిగా నియమితులయ్యారు. ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకు చెన్నైలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు పరిశీలకునిగా నియమితులైన భాస్కర్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అడ్డయ్య అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు రామచంద్రరావు ఎంపిక

శ్రీకాకుళంస్పోర్ట్స్: జాతీయస్థాయిసాఫ్ట్‌బాల్ సౌత్‌జోన్‌చాంపియన్‌షిప్ పోటీలకు కేశవరావుపేటకు చెందిన కూన రామచంద్రరావు ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కలిదిండినరసింహరాజు, కార్యదర్శి సిగిలిపెల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ పోటీలు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రం జనగామలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అనతికాలంలో మంచి ప్రతిభ కనబరుస్తున్న రామచంద్రరావును సంఘం ప్రతినిధులు కె.వెంకట రామారావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ, సాఫ్ట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, సంయుక్త కార్యదర్శి ఎ.రాజగోపాల్, పి.రమేష్, సభ్యులు జి.మల్లేష్ అభినందించారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఆహ్వానం

సరుబుజ్జిలి: రాజమహేంద్రవరంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొని కవితాగానం చేసేందుకు ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు, కర్నేన జనార్దనరావులకు ఆహ్వానం అందింది. గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభల్లో వీరిద్దరు తమ కవితలను వినిపించనున్నారు.

శిథిలావస్థలో రావివలస పాఠశాల భవనం

- నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్థుల వినతి

సరుబుజ్జిలి: మండలంలోని రావివలస ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం మంజూరుచేయాలని గ్రామస్థులు కోరారు.ఈ మేరకు గురువారం పాలవలస గ్రామ సచివాలయం పరిధిలోని రావివలస, రావివలస కాలనీ, చిన్న వెంటాపురంల్లో సర్పంచ్ వండాన కృష్ణ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాంకు రావివలస గ్రామస్థులు పాఠశాల భవనం చూపించి సమస్యను వివరించారు. పాఠశాల లోపలభాగంలో, వంటశాలపెచ్చులు ఊడుతుండడంతో ప్రమాదం పొంచిఉందని ఆందోళనవ్యక్తంచేశారు. భవన నిర్మాణానికి కృషిచేస్తానని స్పీకర్ హామీఇచ్చారు.

వైసీపీ ఉప సర్పంచ్ రాజీనామా

ఆమదాలవలస: మండలంలోని దూసి పంచాయతీ వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ కంచరాన రమణమ్మ రాజీనామా చేశారు. గురువారం ఆమె తన రాజీనామా పత్రాన్ని దూసి గ్రామ సచివా లయ కార్యదర్శికి అందించారు. వైసీపీలో తగిన గౌరవంలేకపోవడం,గ్రామాభివృద్ధికి నియోజకవర్గ నాయకులు కూడా సహకరించకపోవడంతో ఆమె రాజీ నామాచేసి ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు.


రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న రమణమ్మ

'ఉచిత న్యాయసేవలు అందించడమే ధ్యేయం'

అరసవల్లి: ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ఉచితంగా న్యాయ సేవలు అందించడమే శాశ్వత లోక్‌అదాలత్ ధ్యేయమని శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ జి.జ్ఞాన సువర్ణరాజు తెలిపారు.గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ప్రజా ప్రయోజిత సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి, స్త్రీలు, పిల్లలు, దివ్యాంగులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన వారికి ఒక్క రూపాయి కూడా ఖర్చులేని సత్వర న్యాయ పరిష్కారంకోసం శాశ్వత లోక్ అదాలత్ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. సదస్సులో సామాజికవేత్త గేదెల ఇందిరాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో ఇంటింటికి అయోధ్య అంక్షింతలు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో ఇంటింటికి అయోధ్య అంక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, కోశాధికారి ధర్మవరపు ఆచారి, గిరిజా ముక్కంటేశ్వరస్వామి ఆలయఅర్చకులు సంతోష్ శర్మ, మండల ప్రముఖ కన్వీనర్ ఎస్‌పీవీ రమణ, శ్రీవారి సేవకులు వసంతలక్ష్మి, సత్యవతి, ఉమా, పుష్పలత పాల్గొన్నారు. ● **పొందూరు:** ఎచ్చెర్ల చిలకంపాలెం వద్ద అయోధ్య శ్రీరాముని వాహన రథయాత్రకు టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గాడు నారాయణరావు ఆధ్వర్యంలో భక్తులు స్వాగతం పలికారు. కొద్దిరోజుల పాటు జిల్లాలో పలు పట్టణాల్లో శ్రీరాముని వాహనం ఊరేగనుంది. కార్యక్రమంలో నర్సాపురం మాజీ సర్పంచ్ వీఆర్ఎల్ నాయుడు పాల్గొన్నారు.● **గార:** బోరవానిపేట, తాళ్లవలస, ముద్దపువానిపేటల్లో అయోధ్య రామయ్య అక్షింతలు, కరపత్రాలు గురువారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా కన్వీనర్ ఆర్.లక్ష్మి, బాల వికాస్ గురువులు బి.పుణ్యవతి, జి.లావణ్య, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందిపెడితే చర్యలు: తహసీల్దార్

పొందూరు: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది పెడితే మిల్లులపై కఠినచర్యలు తీసుకుంటామని పొందూరు తహసీల్దార్ వైవీ ప్రసాదరావు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మిల్లర్లతో సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో సివిల్‌సప్లై అధికారులు ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని సూచించారు. కార్య క్రమంలో సీఎస్‌డీటీ వెంకటేష్, మిల్లర్లసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్రి రాంబాబు, మిల్లర్లు పాల్గొన్నారు.

బస్సుయాత్ర విజయవంతం చేయాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవికుమార్

బూర్జ: టెక్కలి-కుప్పం టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం నుంచి నిర్వహించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని కొల్లివలస జంక్షన్‌లో బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు, తాపీ పనివారు, ఆటో కార్మికులు, కనీస వేతనదారులు, రోజుకూలీలు , భవన కార్మికు లకు సంబంధించి వైసీపీ విధానాలపై టీడీపీ శ్రేణులు పోరాటానికి సిద్ధం కావాల న్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నారాయణరావు పాల్గొన్నారు.

● **రణస్థలం :** జిల్లాలో ఈనెల ఆరోతేదీన ప్రారంభం కానున్న కార్మిక చైతన్య బస్సుయాత్రను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ విజయనగరం పార్లమెంట్ ప్రధాకార్యదర్శి రౌతు శ్రీనివాసరావు కొరారు. గురువారం పైడిభీమవరంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఏడో తేదీన పైడిభీమవరంలో జరిగే చైతన్య బస్సు యాత్రలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మాధవరావుకు అంబేడ్కర్ జీవితకాల పురస్కారం

సోంపేట: జైభీమ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సిర్ల మాధవరావుకు కాకినాడ జిల్లా జగ్గంపేట ఎంపీయూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ బీఆర్ అంబేడ్కర్ జీవితకాల పురస్కారం అందించినట్లు జైభీమ్‌సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈఅవార్డు ఈయనకు అవార్డు దక్కడంపై సంస్థ ఫౌండర్ నగిరి మోహనరావు, అధ్యక్షుడు బుష్క ఈశ్వరరావు తదితరులు అభినందించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

సోంపేట : ఎర్రముక్కాం గ్రామానికి చెందిన కోడ శ్రీరాములు కిడ్నీ వ్యాధితో ఇటీవలే మృతిచెందడంతో కుటుంబాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శివాజీ గురువారం పరామర్శించారు.ఈ సందర్భంగా శ్రీరాములు కుటుంబానికి పార్టీ అండా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీరాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, బడే తమ్మారావు పాల్గొన్నారు.


శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న శివాజీ

పాయ ధాన్యం కొనుగోలు చేయాలి

పొందూరు: తక్షణమే పాయధాన్యం కొనుగోలు చేయాలని జి.సిగడాం మండలంలోని బాతువ రైతులు కోరారు.ఈ మేరకు గురువారం పొందూరు మండలంలోని కొంచాడ సమీపంలోని లక్ష్మీరాజ్యం మిల్లు వద్ద రైతులు ధర్నాకు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పాయధాన్యం కొనుగోలు చేసేది లేదని మిల్లర్లు నిరాకరిస్తున్నా, అధికారులు వారికి వత్తాసు పలుకుతున్నారని వాపోయారు.


ధర్నా చేస్తున్న బాతువ రైతులు

ఎండీఎం గౌరవాధ్యక్షురాలు గృహ నిర్బంధం

అరసవల్లి: శ్రీకాకుళంలోని ప్రశాంతినగర్‌కాలనీలో మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మిని గురువారం సాయంత్రం పోలీసులు గృహ నిర్బంధంచేశారు. శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికుల చలో విజయవాడ కార్యక్రమానికి హాజరు కాకుండా నిర్బంధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు.

సమయపాలన లేక.. సేవలందక

- ఇదీ సింగుపురం పీహెచ్‌సీ పరిస్థితి

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలంలోని సింగుపురం పీహెచ్‌సీలో వైద్యులు సమయ పాలనపాటించకపోవడంతో సేవలందని పరిస్థితి నెలకొందని పలువురు రోగులు వాపోతున్నారు. ఇక్కడ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో వైద్య సేవలు కొనసాగిస్తుండడంతో రోగులు పీహెచ్‌సీకి వచ్చేందుకు వెనుకగుడువేస్తున్నారు. దీంతో గతంతో పోలిస్తే పీహెచ్‌సీలో ప్రసవాలు, రక్త, వ్యాధి నిర్ధారణ పరీక్షలు సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. 15 సచివాలయాల పరిధిలో వైద్య సేవలకు సింగుపురం పీహెచ్‌సీపై రోగులు ఆధారపడుతున్నారు.అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వైద్యాధికారుల నుంచి సిబ్బంది వరకు హాజరుపట్టికలో సంతకాలు చేయడం, ఆన్‌లైన్ థంబింగ్‌చేయడానికే పరిమితమవుతున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం సింగుపురంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పర్యటించిన సమయంలో కూడా వైద్యులు పీహెచ్‌సీకి గైర్హాజరయ్యారు. కాగా పీహెచ్‌సీలో మలేరియా పరీక్షలు నిర్వహణను పొందుపరిచే రికార్డుల్లో ఈనెల 3వతేదీ పరీక్షలను 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు రోజువారీ పరీక్షల తేదీలను మార్చడం విశేషం. వైద్యపరీక్షలు చేసిన సిరంజీలు, వాడని సిరంజీలను కలిపేస్తూ ఒకేచోట ఉంచి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని రోగులుఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ ఒక్క రోగి కూడా లేకపోవడంతో బెడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి.


వినియోగించిన,వాడని సిరంజీలు

విచారించి శాఖాపరమైన చర్యలు

సింగుపురం పీహెచ్‌పీలో వైద్యుల గైర్హాజరు, సమయపాలన పాటించని విషయం దృష్టికి రాలేదని డీఎంహెచ్‌వో బి.మీనాక్షి ఆంధ్రజ్యోతికి తెలిపారు. తక్షణమే విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు వైద్య సేవలందిచడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించమని తెలిపారు.

టైట్లింగ్ చట్టంపై అభ్యంతరాలు పరిశీలించాలి

అరసవల్లి: ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అభ్యంతరాలను పరిశీలించి, సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని మాజీమంత్రి,టీడీపీ సీనియర్ నాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ కోరారు.గురువారం అరవసల్లిలో విలేకరు లతో మాట్లాడుతూ టైట్లింగ్ చట్టం జ్యుడీషియల్ వ్యవస్థ పాత్రను తగ్గించివేసే ప్రమాదం ఉందని, సామాన్యులు తమ సహజమైన హక్కును కోల్పో యే ప్రమాదం ఉందని ఆందోళనవ్యక్తంచేశారు. ఈ చట్టంపై రెవెన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావు బాధ్యత వహించాలన్నారు. దీనిపై రెవెన్యూమంత్రి తన అభిప్రాయాన్ని తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

అంధుల ఆశాజ్యోతి బ్రెయిల్

అంధుల ఆశాజ్యోతి లూయిస్ బ్రెయిల్ అని వక్తలు తెలిపారు. గురువారం జిల్లాలో లూయిస్ బ్రెయిల్ జయంతి పురస్కరిం చుకుని ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలల్లో బ్రెయిల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూల మాలలువేసి హెచ్ఎం సుహాష్‌చంద్ నివాళులర్పించారు. **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురంలోని ఎంపీఎల్ ప్రాథమిక పాఠశాలలో గల భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిల్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా లూయిస్ చిత్ర పటానికి ఎంఈవో అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోహెచ్ఎం టి.శివకుమార్, ఉదయ్,పావని, ఐఈఆర్‌పీఎస్‌లు ఎస్.సూర్యం, హెచ్.సోమేష్, అరుణ, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. ● **అరసవల్లి:** లూయిస్ బ్రెయిల్ అంధుల పాలిట ఆరాధ్యదైవంగా నిలిచారని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని డీఆర్‌డీఏ సమావేశమందిరంలో బ్రెయిల్ జయంతి పురస్కరించుకుని బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, సంక్షేమాధికారిసుధ, జిల్లా ఎంప్లాయి మెంట్ అధికారి ప్రసన్న, అంధ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

19 నుంచి శిక్షణ తరగతులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ ప్రాంత యువకులకు సీసీ టీవీ ఇన్‌స్టాంటేషన్, సర్వీసింగ్‌లో ఈనెల 19 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. 13 రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 19-45 ఏళ్లలోపు వయసు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని చెప్పారు. వివరాల కోసం ఫోన్ నెంబర్లు 79933 40407, 95534 10809కు సంప్రదించాలని కోరారు.

డీఈవో విచారణ

శ్రీకాకుళం క్రైం: విద్యార్థినిని పదో తరగతి అనంతరం తమ కళాశాలలోనే చేర్పించాలని ఓ స్కూల్ సిబ్బంది ఒత్తిడిచేశారని వచ్చిన ఫిర్యాదుపై డీఈవో కె.వెంకటేశ్వరరావు విచారణచేపట్టారు. ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకోవాలన్న విషయంపై మాత్రమే చర్చించినట్లు విచారణలో తేలింది. తాను స్వయంగా విచారణ చేపట్టానని, విద్యార్థినితో పాటు తోటి విద్యార్థులతో కూడా మాట్లాడానని డీఈవో గురువారం విలేకరులకు తెలిపారు.

జయహో సభకు టీడీపీ నాయకులు



జయహో బీసీ సభలో పాల్గొన్న టీడీపీ నాయకులు

గార: మండలం నుంచి మంగళగిరిలో గురువారం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా నిర్వహించిన జయహో బీసీ రాష్ట్ర సభకు పలువురు నాయకులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు జల్లు రాజీవ్, కైబాడి రాజు, కొండాశంకర రెడ్డి, కోరాడ హరగోపాల్, అధికార్ల ఆదినారాయణ, చెంగలరావు, అసిరయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

ఆమదాలవలస: వైఎస్ షర్మిల చేరికతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ సమక్షంలో షర్మిల పార్టీలో చేరడంతో ఉత్తేజం కలిగిందని పేర్కొన్నారు.

జనసేన జిల్లా అధ్యక్షుడిగా పిసిని

శ్రీకాకుళం క్రైం: జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా పిసిని చంద్రమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయం అధినేత పవన్‌కల్యాణ్ నియామక పత్రాన్ని అందజేశారు.


నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

స్పీకర్‌కు స్వల్ప అస్వస్థత

శ్రీకాకుళం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ తమ్మినేని సీతారాం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గురువారం బూర్జ మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలొన్నారు. ఆ తరువాత స్వల్పంగా ఆరోగ్య సమస్య ఏర్పడడంతో రాత్రి శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు స్పీకర్‌ను పరీక్షించి హెవీ డీహైడ్రేషన్ తప్ప ఇతరత్రా సమస్యలేవీ లేవని నిర్ధారించారు. స్పీకర్ తమ్మినేనికి సాధారణ పరీక్షలు కూడా చేపట్టారు.


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


మందసలో అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



పొందూరు: సమ్మెచేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

- స్పష్టంచేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు
- 24వ రోజుకు చేరిన సమ్మె

తమ సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటాలు ఆగవని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్పష్టంచేశారు. గురువారానికి జిల్లాలో సమ్మె 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు , ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. కాగా పలుసంఘాలు అంగన్‌వాడీ కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కోటబొమ్మాళి: ప్రాజెక్టు కార్యాలయం వద్ద అధికారులిచ్చిన షోకాజ్‌నోటీసులను కాల్చి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పలాసరూరల్: కాశీబుగ్గ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


పాతపట్నం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు